




RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY

సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శుక్రవారం 26-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 195 పేజీలు : 4 వెల : రూ 2-00


## పశువుల కొట్టంలోకి దూసుకెళ్లిన బస్సు

ఆదిలాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పశువుల కొట్టంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో కరంజీ (టి) నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న బస్సు ఆర్లీ(టి) గ్రామంలోకి రాగానే అదుపుతప్పి బస్సు రోడ్డు పక్కనే ఉన్న బక్కి ఆనిల్ అనే రైతు కొట్టంలోకి దూసుకెళ్లి.. కట్టేసి ఉన్న ఎద్దును డీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా.. చాలా మందికి గాయాలు అయినట్లు చెబుతున్నారు. ఇక గాయాలు అయిన వారిని వెంటనే ఆస్పత్రికి కూడా తీసుకెళ్లారట. ఈ ప్రమాదంపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

గత ప్రభుత్వ విధ్వంసం నుంచి విజయతీరాలకు
ఆర్థిక లోటు నుంచి కోలుకునే దిశగా అడుగులు
వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ కేటాయింపులు
ఆర్థిక లోటు అంచనా రూ.49,255.41 కోట్లు
ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
ఉద్యానశాఖకు రూ.737కోట్లు
పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
గృహజ్యోతికి రూ.2,418కోట్లు
ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు
రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు రూ.1,525 కోట్లు
స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
ఐటీ శాఖకు రూ.774 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
విద్యకు రూ.21,292 కోట్లు
హోంశాఖకు రూ.9,564కోట్లు
రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు

# అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి



హైదరాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ): అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా..వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా...అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీదర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హామీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటిస్తూ..డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. రూ.72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయరంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దుష్ట విధానం లేదు

### బడ్జెట్‌లో అన్నిరంగాలను విస్మరించారు
### వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై అస్పష్టత
### మీడియా పాయింట్ వద్ద కెసిఆర్ విమర్శలు
### ఓటమి తరవాత తొలిసారి అసెంబ్లీకి హాజరు



హైదరాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ): తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై నిర్దిష్టమైన విధానం లేదని భారాస అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన తొలిసారి అసెంబ్లీకి హాజరయ్యారు. కెసిఆర్ ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్న వారి ఉత్కంఠకు తెరదించుతూ సమావేశాలకు వచ్చారు. బడ్జెట్ ప్రసంగం తరవాత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. భారాస హయాంలో మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎగ్గొడతామని చెబుతోంది. మేం రైతులకిచ్చిన డబ్బును దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వమని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీటి సరఫరా, గొర్రెల పంపిణీ లేదు. రైతు భరోసా గురించి ప్రస్తావనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వృత్తి కార్మికులను వంచించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పేదల, రైతు బడ్జెట్ కాదని అన్నారు. ప్రభుత్వానికి ఒక విదానమంటూ లేదన్నారు. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదన్నారు. రైతు భరోసాలో అనేక ఆంక్షలు పెడుతున్నట్టు చెప్పారు. ప్రజల గొంతు కోసింది ఈ ప్రభుత్వం. దళితబంధు పథకం ప్రస్తావనే లేదు. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేమీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల. అన్ని వర్గాలను మోసం చేసింది. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు. పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా? బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం అన్నారు. యాదవులు, మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం.

## గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం

### డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు
### హోంశాఖకు బడ్జెట్ లో రూ.9,564 కోట్లు కేటాయింపు

హైదరాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ):రాజధాని హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పేట్రేగిపోతున్న గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇటీవల సినీ పరిశ్రమకు కూడా కీలక సూచనలు సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా బడ్జెట్ లోనూ దీన్ని ప్రధానంగా ప్రస్తావించారు. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల కట్టడి, శాంతి భద్రతల కోసం హోం శాఖకు బడ్జెట్ లో రూ.9,564 కోట్లు కేటాయించింది. మాదక ద్రవ్యాల వినియోగం చాలా ప్రమాదకరం. యువత దీని బారినపడితే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతుంది. రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను ఈ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రవాణా, వినియోగం చేస్తూ పట్టుబడితే వారిని ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. తెలంగాణ మాదకద్రవ్య నిరోధక సంస్థకు తగిన సౌకర్యాలు కల్పించి దాన్ని బలోపేతం చేశాం. విద్యాసంస్థల్లో వీటి కట్టడికి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి.. 4,137 మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా నియమించాం. మాదక ద్రవ్యాల వల్ల జరిగే హానిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖుల సహకారం తీసుకుంటున్నాం. వీటికి సంబంధించిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాం అని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. మరోవైపు నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాలపైనా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయాన్ని కూడా మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధికి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో అవసరం. అభద్రతా వాతావరణంలో పెట్టుబడి పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపించవు. ఈ మధ్య వైట్ కాలర్, సైబర్ నేరాలు పోలీసు వ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ విభాగానికి అవసరమైన వాహనాలు అందించాం. ఆధునిక నేర పరిశోధనలో పోలీసులకు శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులను నమోదు చేసే అవకాశం కల్పించాం. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేసేలా వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించేలా శిక్షణా తరగతులు నిర్వహించాం అని మంత్రి భట్టి వివరించారు.

## నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిన కర్ణాటక అసెంబ్లీ

నీట్ పరీక్ష కు వ్యతిరేకంగా కర్ణాటక అసెంబ్లీ తీర్మానం చేసింది. కర్ణాటక మెడికల్ ఎడ్యుకేషన్ ఽ స్కిల్ డెవలప్ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై చర్చ అనంతరం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. నీట్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కొన్ని రోజుల క్రితమే కర్ణాటక క్యాబినెట్ నిర్ణయించింది.కర్ణాటక క్యాబినెట్ నీట్ రద్దుపై నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే పశ్చిమబెంగాల్ అసెంబ్లీ నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. ఈ నెల 23న నీట్ రద్దును కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానం బెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది.

# విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం

### మరింత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి కృషి
### పలు మార్గాల్లో మెట్రో విస్తరణకు నిధులు
### మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో మార్పు



హైదరాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ): విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ.10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1500 కోట్లు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ.1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్ లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ.24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం. హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు అద్దుతామని అన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూసీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1,500 కోట్లు ప్రతిపాదన చేశారు.

## బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు పెద్దపీట

### ఉచితబస్సు, గ్యాస్, విద్యుత్ పథకాలకు నిధులు
### మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు
### ఆర్టీసి ఉచిత బస్సుకు రూ.200 కోట్లు
### గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు

హైదరాబాద్,జూలై25: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ఆరు గ్యారంటీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రారంభించిన సర్కారు.. తాజా బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల్లో మరికొన్ని పథకాలనూ ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర నుంచి ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌ను తమ ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం వల్ల ఇప్పటి వరకు 39,57,637 కుటుంబాలకు లబ్ది చేకూరిందని, ఇందుకు రూ.200 కోట్లను ప్రభుత్వం వెచ్చిందన్నారు. ఈ బడ్జెట్‌లో గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు.మహిళను మహాలక్ష్మిగా గౌరవించడం మన సంస్కృతి అని, మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ టీజీఆర్టీసీ నడిపే బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రయాణించే దూరంపైన, ప్రయాణించే పర్యాయాలపైన ఎటువంటి పరిమితీ విధించలేదని చెప్పారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు 27కు వాయిదా

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 27కు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది.తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ప్రతిపాదించారు.ఇక బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 26, 28, 29, 30 తేదీల్లో సభకు సెలవు ప్రకటించారు. 27న బడ్జెట్‌పై చర్చ చేపట్టి, అదే రోజు ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరపనున్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 26-07-2024

## బిజెపి కుత్సిత రాజకీయాలు !

రాజకీయాల్లో బుకాయింపులు, బెదరింపులు..ఎదురుదాడులు సర్వసాధారణమయ్యాయి. ఈ మధ్య ఇవి మరీ ఎక్కువయ్యాయి. బడ్జెట్ నిర్లక్ష్యంపై తెలంగాణ అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ సందర్భంగా అనేక విషయాలు గమనించవచ్చు. ప్రధానంగా బిజెపి ఈ విషయంలో తన దురుసుతనాన్ని ప్రదర్శించింది. అసెంబ్లీలో బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభలో నిర్మలా సీతారామన్‌లు చేసిన వ్యాఖ్యలు చూస్తే ఇలాంటి నేతలను ఎన్నుకున్నందుకు సిగ్గుపడాలి. బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయా లేదా అన్నది ప్రధాన అంశం. ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఖుల్లంఖుల్లాగా తేలింది.. బడ్జెట్‌లో ఎక్కడా తెలంగాణకు కేటాయింపులు జరిగిన దాఖలాలు లేవు. ఈ విషయంపై మాట్లాడుకోవడంలో తప్పు లేదు. అసెబ్లీలో చర్చించుకోవడంలోనూ తప్పులేదు. ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారం. కాంగ్రెస్, బిజెపిలకు మధ్యనో లేదా, బిఆర్ఎస్ కాంగ్రెస్‌కు మధ్య వ్యవహారమో కాదు. ఇది నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన వ్యవహారం. ఈ విషయంలో పార్టీల నేతలతంతా జావాబుదారీగా ఉండాల్సిందే. బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మొదటి నుంచి తెలంగాణ పట్ల కక్ష చూపిస్తున్నారని సిఎం రేవంత్ విమర్శించారు. కుర్చీని కాపాడుకునే విధంగా ఈ బడ్జెట్ ఉంని, బీహార్, ఎపిలను మాత్రమే ప్రధాని పట్టించు కున్నారని, ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదని సిఎం రేవంత్ విమర్శించారు. ఇండియా కూటమి నేతలు కూడా ఇదే విషయమై ఆందోళన చేశారు. రాష్ట్ర ఏర్పాటును అవమానించిన ప్రధాని మోడీ మొదటి నుంచి రాష్ట్రంపై కక్ష చూపిస్తున్నారని సిఎం రేవతం మండిపడడంలో తప్పులేదు. రాష్ట్ర మంత్రులతో కలిసి ఇప్పటికే 18 సార్లు కేంద్రాన్ని కలిసి విజ్ఞప్తి చేసినా, రాష్ట్రానికి న్యాయం చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. 41లక్షల కోట్ల బడ్జెట్‌ను కేవలం ఎన్డీఏ మిత్ర పక్ష రాష్ట్రాలకే దోచిపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంలో తప్పులేదు. అయితే దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చాలా అపహాస్యంగా ఉన్నాయి. ఢిల్లీకి వచ్చింది మాకోసం కాదు..కాంగ్రెస్ పెద్దలను కలవడానికే అని ఎద్దేవా చేయడం ఆయన సంకుచిత రాజకీయాలను బయటపెట్టింది. నిజానికి కేటాయింపులు జరిగాయని ఇప్పటికీ కేంద్రమంత్రి చెప్పలేక పోతున్నారు. జరిగితే ఎక్కడ ఎంతమొత్తం పెట్టారో చెప్పాలి. కానీ అలా చెప్పకుండా ఎదురుదాడికి దిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక కేంద్రంపై విమర్శలు చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడంలో తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బురదజల్లే డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. కేసీఆర్ ఎలాగైతే వ్యవహరించారో అదే తరహాలో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తుండటం తెలంగాణ ప్రజల దురదృష్టమని తనదైన రాజకీయ విశ్లేషణ ఇచ్చుకున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరు తెలంగాణ ప్రజలందరినీ అవమానిం చేలా ఉ ఒదని కూడా మండిపడ్డారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పించన్లు లేవు సరికదా పాత పింఛన్లు కూడా ఇవ్వడం లేదని ఓ నిట్టూర్పు విడిచారు. ఎన్ని హామీలిచ్చారు..? ఏం చేశారో చెప్పమంటే చేతకాదు కానీ బడ్జెట్ పేరు చెప్పి అసెంబ్లీలో తీర్మానం పెడతారా? అని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా కిషన్ రెడ్డి తన అక్కసునంతా ఇలా వెళ్లగక్కారు. అసలు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారా లేదా అన్నదానికి మాత్రం సమాధానం చెప్పలేకపోయారు. బయ్యారం ఉక్కు విషయంలో అక్కడ లభించే ఐరన్ ఓర్ నాణ్యత అంత బాగాలేదని నిపుణులు చెప్పారని మెల్లగా సెలవిచ్చారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దేశ భవిష్యత్తుకు సంబంధించిన అనేక రకాల కార్యక్రమాలను పొందుపర్చారని అన్నారు. నిజాంగా రోగమొకటి అయితే మందు మరోటి అన్నట్లుగా కిషన్ రెడ్డి సమాధానం ఉంది. ఇలాంటి సమాధానాలతో ప్రజలను మభ్యపెట్ట లేమని కేంద్రమంత్రి గుర్తించివుంటే బాగుండేది. ఇక అసెంబ్లీలో పార్టీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అయితే తీర్మానం తప్పని, వాకౌట్ చేశారు. అసెంబ్లీలో చర్చ పెట్టి తీర్మానాలు చేయడం తప్పని అన్నారు. పార్టీ ఆదేశాలతో ఆయన కూడా నిజాలు మాట్లాడలేక పోయారు. కేటాయింపులపై నిర్మలా సీతారామన్ కూడా తన అక్కసు వెళ్లగక్కారు. బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లు ఎలా ప్రస్తావిస్తామన్న కొత్త వాదనను ప్రకటిం చారు. బడ్జెట్ అనేది అంకెల కూర్పు లేదా కేంద్ర ప్రభుత్వ శాఖల వారీ కేటాయింపుల వ్యవహారం మాత్రమే కాదు. అది కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలికి, భవిష్యత్ దార్శనికతకు సంకేతం. ఆ రకంగా రాబోయే ఐదేళ్లు తెలంగాణ పట్ల మోదీ ప్రభుత్వ తీరు ఎలా ఉంటుందనడానికి ఈ బడ్జెట్ ద్వారా స్పష్టం అయ్యింది. బడ్జెట్ అనంతరం జరిగిన చర్చల్లో బీజేపీ నాయకుల వాదన అత్యంత పేలవంగా ఉంది. ఈ బడ్జెట్ రాష్ట్రాల వారీ కేటాయింపులు కాదు, శాఖల వారి కేటాయింపులు అని సమర్థించుకోవడం దాటవేత వ్యవహారంగా చూడాలి. తెలంగాణ గురించి అడిగితే డొంక తిరుగుడు సమాధానం చెప్పడం దారుణం కాక మరోటి కాదు. విభజన చట్టం గురించి ప్రస్తావిస్తూ ఏపీ గురించి మాట్లాడిన కేంద్ర ఆర్థికమంత్రి తెలంగాణ వెనుకబడిన ప్రాంతాల గురించి ఎందుకు మాట్లాడలేదంటే సమాధానం రాదు. బిహార్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఎందుకిచ్చారో..ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో దేశమంతటికీ అర్థమైంది. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు దయాదాక్షిణ్యాల మీద మోడీ పదవి, పరువు నిలబడి ఉంది. ఆ విషయం బీజేపీ నాయకత్వానికి బాగా తెలుసు. అందుకే ఈ అదనపు వడ్డింపులు అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. బీజేపీ గత వైఖరికీ నేటి పరిస్థితికీ ఉన్న తేడాను స్పష్టం చేసింది. తనకు తిరుగులేదని చాటుకున్న మోడీ ఇప్పుడు పిల్లిలాగా అణగిమణగి ఉండాల్సిందేనన్న విషయం బడ్జెట్ నిరూపించింది. ఈ విషయంలో నిజాలు అంగీకరించకుండా బిజెపి నేతలు ఇంకెంతో కాలం ఎదురుదాడికి దిగలేరు. దిగితే ప్రజలు ఎక్కడో ఒకచోట కర్రుకాల్చి వాతపెడతారని గుర్తించాలి. నిధులు కేటాయింపు అన్నది పార్టీల వ్యవహారం కాదు. అభివృద్ధి అన్నది ప్రజలకు సంబంధించినదిగా చూడాలి.

## తెలంగాణ అంగన్‌వాడీ సేవలు దేశానికి ఆదర్శం

### యూనిసెఫ్ బృందం పర్యవేక్షణ సంతృప్తి









కామారెడ్డి జిల్లా రామారెడ్డి (లోకంతీరు) జూలై 25 కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో బుధవారం యుఎన్ఎఫ్ ప్రత్యేక బృందంఇసన్నపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు.వారు పిల్లలతో ముచ్చటించి, వారితో సరదాగా కాసేపు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, సెంటర్ యొక్క లబ్ధిదారులతో మాట్లాడుతూ తెలంగాణలోనిఅంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని యునిసెఫ్ అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు కొనియాడారు. ప్రైమరీస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల పోషణ విధానాన్ని యునిసెఫ్ ప్రతినిధి బృందం సభ్యులు పరిశీలించారు.రాష్ట్రంలో అంగన్‌వాడీల్లో పిల్లల పోషణ, సంక్షేమంలో అంగన్‌వాడీ కేంద్రాలు బాగాపనిచేస్తున్నాయని సంతృప్తినివ్యక్తం చేశారు. తదుపరి గ్రామంలోని మిని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ యొక్క కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రత్యేక బృందం సభ్యులు, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ సృజన, హెల్పర్, చిన్నపిల్లలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్రిక ఎడిటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కానుకంటి శివప్రసాద్



నిజామాబాద్,జులై 25(లోకంతీరు ): ది ఎడిటర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కానుకంటి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశనీలో నిరంతర జ్వాల పత్రిక ఎడిటర్ కానుకంటి శివప్రసాద్ ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అసోసియేషన్ అధ్యక్షులు సింగోజు దేవిదాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా కానుకంటి శివప్రసాద్ మాట్లాడుతూ పత్రికా నిర్వహణ భారం అవుతున్న నేటి తరుణంలో వృత్తికి అంకితమై పని చేస్తూ అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చుకుంటూ పత్రిక నడిపించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న మీారందరికి శుభాభివందనాలు తెలియజేశారు. ఎడిటర్స్ అసోసియేషన్ విధుల నిర్వహణకు, పత్రికల ప్రజాదరణకై మరింత ముందడుగు వేయడానికి ఎప్పటికప్పుడు మీ సహాయ సహకారాలు అవసరమైనదిగ భావిస్తున్నాను. మనందరి ఐక్యతతో పత్రిక నిర్వహణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతలను మీద వేసుకొని కొత్త మార్గాలను అన్వేషించుకుంటూ చిన్న పత్రికల యొక్క సత్తా చాటడానికి ఈ అసోసియేషన్ అంకితభావం గా పని చేయాలని ఆశిస్తున్నాను. ఎప్పటికప్పుడు కొత్త కొత్త సామాజిక సేవా కార్యక్రమాలను ఎన్నుకొని కలానికి మరింత పదును పెంపొందించుకోవాలని,అందుకోసం మన అందరం ఐక్యతగా ఉండడం ఎంతో అవసరం అని భావిస్తున్నాను. ఈ తరుణంలో జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ ఆదర్శవంతంగా పనిచేస్తుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించుకోవడానికి ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడుతున్నాను. మరిన్ని కొత్త కొత్త అంశాలను మన అందరం పంచుకొని అసోసియేషన్ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందడుగు వేద్దామని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇట్టి కార్యక్రమం లో ఎడిటర్ అసిసియేషన్ వైస్ ప్రసిడెంట్ సిరిగాద ప్రసాద్, క్యాషియర్ సురేందర్, మండే మోహన్,లక్కం మనోజ్ రెడ్డి,రవి బాబు, రాజా లింగం, బ్యాగల్ శ్రీనివాస్,అక్షరం ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పెద్ద చెరువును పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్

### గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి



కామారెడ్డి జిల్లా (లోకంతీరు) జూలై 25 కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలో అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువును మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి సందర్శించారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్స్ తో కలిసి మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. కామారెడ్డి పట్టణ ప్రజలు తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని టెక్రియల్ సమీపంలో గల పెద్ద చెరువును నీటి లభ్యత గురించి చర్చించారు. కామారెడ్డి పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుండగా పట్టణవాసులు త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇండప్రియ తెలిపారు. కామారెడ్డి పట్టణంకు తాగు నీటి అవసరం కోసం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు నుంచి 30 శాతం మంచి నీటి సప్లై కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.తాగు నీటి అవసరం కోసం 30% నీటిని వినియోగించుకోవడం కోసం ఇప్పటికే అధికారుల ద్రుష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో మంచి నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు తెలిపారు. తాగు నీటి అవసరం కోసం సత్వర ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, డిఈ సంతోష్, టీపిఓ గిరిధర్, కౌన్సిలర్లు పాత శివకృష్ణమూర్తి, తైబసుల్తానా సలీం, లడ్డు మొయినుద్దీన్, ఆస్మా అంజత్,ఇరిగేషన్,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## చందమామపై నీటి జాడలు




బీజింగ్, జూలై 25, (న్యూస్ పల్స్) చందమామ రావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. అంటూ చిన్నప్పుడు చందమామను చూపిస్తూ పిల్లలకు తల్లులు అన్నం తినిపించే దృశ్యాలు ఇప్పటికీ గ్రామాల్లో మననకు కనిపిస్తుంటాయి. అయితే ఆ చందమామ రాదని పిల్లలకు తెలియదు. తల్లులకు తెలుసు. కానీ, పిల్లలను ముద్దు చేస్తూ.. పిల్లలు చంద్రున్ని పిలుస్తుంటారు. ఇన్నాళ్లూ అందదు అని భావించిన చందమామ అందే రోజులు అతిత్వరలోనే రానున్నాయంటున్నారు పరివోధకులు. ఈ మేరకు ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇటీవలే భారత్ చంద్రయాన్ ?3 లో భాగంగా రాకెట్‌ను చంద్రుడిపైకి పంపించింది. రెండు చంద్రయాన్?1, చంద్రయాన్ ?2 విఫలమైనా.. చంద్రయాన్ ? 3తో భారత్ కూడా ప్రపంచంలో ఇప్పటి వరకు చంద్రుడిపైకి వెళ్లేందుకు ఇతర దేశాలు చేసిన ఖర్చుకన్నా తక్కువ ఖర్చుతో శాటిలైటను భారత్ చంద్రుడిపైకి పంపింది. ఈ శాటిలైట్ సూర్యుడి శక్తి ఆధారంగా పనిచేసింది. చంద్రుడిపై విజయవంతంగా ల్యాండ్ అయిన ఉప గ్రహం సుమారు ఐదు రోజులపాటు అక్కడి దృశ్యాలను కిందకు పంపించింది. తర్వాత చీకటి రావడంతో పనిచేయడం మానేసింది. ఇక ఇదే సమయంలో రష్యా కూడా ఉప గ్రహాన్ని చంద్రుడిపైకి పంపించింది. కానీ, అది విజయవంతం కాలేదు. ఆ తర్వాత చైనా కూడా చంద్రుడి అవతలివైపు ఉపగ్రహానిన విజయవంతంగా లాంచ్ చేసింది. చాంగే ? 5 సాయంతో జాబిల్లి నుంచి భూమికి మట్టిని తీసుకువచ్చిన చైనా.. నాలుగేళ్లుగా పరిశోధనలు చేస్తోంది. ఈ క్రమంతో ఈ పరిశోధనల ఫలితాల ఆధారంగా చంద్రునిపై నీరు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విషయాన్ని చైనీస్ అకాడమ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. చంద్రుడిపై మట్టి నమూనాల సేకరణ నలక్ష్యంగా చైనా 2020లో చేపట్టిన చాంగే ? 5 ప్రయోగం విజయవంతమైంది. చంద్రుడి ఉపరితలం నుంచి దాదాపు 2 కిలోల మట్టి, రాళ్ల నమూనాలను భూమిపైకి తీసుకువచ్చింది. అనంతరం వాటిపై బీజింగ్‌లోని నేషనల్ లేబొరేటరీ ఫర్ కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్, సీఏఎస్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. ఆ నామూనాల్లో విస్తృత స్థాయిలో నీటి అణువులు ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు సీఏఎస్ ఇటీవల పేర్కొంది. ఇందుఉ సంబంధించిన పరిశోధన పత్రాన్ని ఓ జర్నల్‌లో ప్రచురించినట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా జాబిల్లిపై పరిశోధనలో భాగంగా అమెరికాకు చెందిన ఇద్దరు వ్యోమగాములు 40 ఏళ్ల క్రితమే చంద్రునిపైకి వెళ్లి మట్టి నమూనాలు సేకరించారు. అనంతరం సోవియట్ యూనియన్ కూడా 1976లో చంద్రుడిపై మట్టి నమూనాలను భూమికి తీసుకువచ్చింది. ఈ రెండు దేశాల తర్వాత జాబిల్లి నుంచి మట్టిని సేకరించిన మూడో దేశం చైనా.. అయితే 2009లో భారత్ ప్రయోగించిన చంద్రయాన్?1 వ్యోమనౌక చంద్రుడిపై నీటిజాడ ఉన్నట్లు గుర్తించింది. అయితే దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో భారత వాదనను ఎవరూ విశ్వసించలేదు. కానీ, భారత వాదననే ఇన్నేల్లకు నిజమైంది. భారత వాదనే నిజమని చైనా ధ్రువీకరించింది.

## తెలంగాణ అంగన్‌వాడీ సేవలు దేశానికి ఆదర్శం

### -- యూనిసెఫ్ బృందం పర్యవేక్షణ సంతృప్తి



కామారెడ్డి జిల్లా రామారెడ్డి (లోకంతీరు) జూలై 25 కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో బుధవారం యుఎన్ఎఫ్ ప్రత్యేక బృందంఇసన్నపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు.వారు పిల్లలతో ముచ్చటించి, వారితో సరదాగా కాసేపు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, సెంటర్ యొక్క లబ్ధిదారులతో మాట్లాడుతూ తెలంగాణలోనిఅంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని యునిసెఫ్ అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు కొనియాడారు. ప్రైమరీస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల పోషణ విధానాన్ని యునిసెఫ్ ప్రతినిధి బృందం సభ్యులు పరిశీలించారు.రాష్ట్రంలో అంగన్‌వాడీల్లో పిల్లల పోషణ, సంక్షేమంలో అంగన్‌వాడీ కేంద్రాలు బాగాపనిచేస్తున్నాయని సంతృప్తినివ్యక్తం చేశారు. తదుపరి గ్రామంలోని మిని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ యొక్క కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రత్యేక బృందం సభ్యులు, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ సృజన, హెల్పర్, చిన్నపిల్లలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింట ఇన్నోవేటర్ కార్యక్రమం






నిజామాబాద్,జులై 25(లోకంతీరు)జక్రాన్పల్లి మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటింట ఇన్నోవేటర్ కార్యక్రమం గురించి ఎంపీడీఓ. సతీష్ కుమార్ గారు గ్రామ స్థాయిలో దీని గురించి విస్తృతంగా గ్రామసభ నిర్వహించి ప్రజలలో చైతన్యం కల్పించాలని గ్రామ పంచాయతీ సెక్రటరీలను కోరారు అదే విధంగా కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం మరియు ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయం జిల్లా కోఆర్డినేటర్ సందీప్ రాజ్ వివరించారు.తదనంతరం ఇట్టి కార్యక్రమం యొక్క గోడ పత్రికలు ఆవిష్కరించడం మరియు ప్రతి పంచాయతీ కార్యదర్శికి ఒక గోడ పత్రికను అందజేయటం జరిగింది.

## వికలాంగులపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



లోకంతీరు రాజంపేట కామారెడ్డి జూలై 25వికలాంగులపై అనుచిత వాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ తన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని రాజంపేట మండల వికలాంగుల హక్కుల పోరాట సమితీ నాయకులు గజ్జెల రాజు గురువారం పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు ఎందుకు అంటు ఆమె చేసిన వాఖ్యలు సరి కాదని ఓ సీనియర్ అధికారి దివ్యాంగులపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వికలాంగులకు ధైర్యం నింపాల్సిన అధికారి అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, వభుత్వం వికలాంగులకు ఎంతో అండగా ఉందని ప్రభుత్వంలో పని చేస్తున్న అధికారులు దివ్యాంగులపై చేస్తున్న వాఖ్యలు సరికావని డిప్యూటి ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, మాజీ మంత్రులు సబర్వాల్ మాటలను తప్పు పట్టారని అయిన మళ్ళీ స్వరం వణుకుతూ, నిజమే మాట్లాడండి అంటు మరోసారి చేసిన వెంటనే వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో వికలాంగుల సంఘం అద్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

## బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు పెరిగినప్పటికీ సరిపోవు :టిఎస్ యుటిఎఫ్



బీ, ం గ ్ ల్ ప్రతినిధి(లోకంతీరు): గత సంవత్సరం రూ.2,90,000 కోట్ల బడ్జెట్ లో విద్యారంగానికి రూ.19,093 కోట్లు కేటాయించారని, ఈ సంవత్సరం రూ.2,91,000 కోట్ల బడ్జెట్ లో రూ.21,292 కోట్లు కేటాయించారని టిఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కు జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ లో విద్యారంగానికి గత సంవత్సరం కంటే రూ.2,200 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15% లో సగానికి మించలేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఈ కేటాయింపులు ఏ మాత్రం సరిపోవని, వెంటనే పునఃసమీక్షించి విద్యారంగానికి బడ్జెట్ పెంచాలని ఆర్థిక మంత్రిని ఆయన కోరారు. పలు పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని నూతన భవనాలు నిర్మించి శౌచాలయాలు, త్రాగు నీటి వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించటానికి నిధులు కేటాయించాలని ఇంకా ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సర్వీసు పర్సన్ల నియామకం, ఉచిత విద్యుత్తు అమలు ప్రస్తావన బడ్జెట్ లో లేకపోవటం విచారకరమని ఆయన అభిప్రాయపడ్డారు.అంగన్ వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు 3వ తరగతి వరకు ప్రాథమిక విద్యను విలీనం చేయాలని నిర్ణయించటం ప్రభుత్వ విద్యారంగానికి పెద్ద దెబ్బ అవుతుందని, కావున ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు అంగన్ వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా గుర్తించడం లేదని, ప్రాథమిక తరగతులను అంగన్ వాడీల్లో విలీనం చేయటం వలన పలు ప్రాథమిక పాఠశాలలు మూతబడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో సంస్కరణలు చేసేముందు క్షేత్రస్థాయిలో ప్రధాన భాగస్వాములైన తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

# నిజామాబాద్ జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కానుకంటి శివప్రసాద్



నిజామాబాద్, జులై 25(లోకంతీరు) ది ఎడిటర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కానుకంటి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశనీలో నిరంతర జ్వాల పత్రిక ఎడిటర్ కానుకంటి శివప్రసాద్ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అసోసియేషన్ అధ్యక్షులు సింగోజు దేవిదాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా కానుకంటి శివప్రసాద్ మాట్లాడుతూ పత్రికా నిర్వహణ భారం అవుతున్న నేటి తరుణంలో వృత్తికి అంకితమై పని చేస్తూ అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చుకుంటూ పత్రిక నడిపించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న మీారందరికి శుభాభివందనాలు తెలియజేశారు. ఎడిటర్స్ అసోసియేషన్ విధుల నిర్వహణకు, పత్రికల ప్రజాదరణకై మరింత ముందడుగు వేయడానికి ఎప్పటికప్పుడు మీ సహాయ సహకారాలు అవసరమైనదిగ భావిస్తున్నాను. మనందరి ఐక్యతతో పత్రిక నిర్వహణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతలను మీద వేసుకొని కొత్త మార్గాలను అన్వేషించుకుంటూ చిన్న పత్రికల యొక్క సత్తా చాటడానికి ఈ అసోసియేషన్ అంకితభావం గా పని చేయాలని ఆశిస్తున్నాను. ఎప్పటికప్పుడు కొత్త కొత్త సామాజిక సేవా కార్యక్రమాలను ఎన్నుకొని కలానికి మరింత పదును పెంపొందించుకోవాలని,అందుకోసం మన అందరం ఐక్యతగా ఉండడం ఎంతో అవసరం అని భావిస్తున్నాను. ఈ తరుణంలో జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ ఆదర్శవంతంగా పనిచేస్తుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించుకోవడానికి ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడుతున్నాను. మరిన్ని కొత్త కొత్త అంశాలను మన అందరం పంచుకొని అసోసియేషన్ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందడుగు వేద్దామని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇట్టి కార్యక్రమం లో ఎడిటర్ అసిసియేషన్ వైస్ ప్రసిడెంట్ సిరిగాద ప్రసాద్, క్యాషియర్ సురేందర్, మండే మోహన్, రవి బాబు, రాజా లింగం, అక్షరం ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చెరుకు రైతులకు రుణమాఫీ ఇచ్చేస్తాం సరే..!

## జాప్యానికి పరిష్కారం ఏమిటి..?

- -- గత 20 సంవత్సరాలు నుండి రుణమాఫీ ఎన్నిసార్లు మాఫీ వర్తించింది
- -- గత 20 సంవత్సరాలుగా బ్యాంకులో రైతుల తరఫున రుణాలు..?
- -- రైతులకు తెలియకుండానే తీసుకున్నందుకు పరిహారం.?
- -- 2002 నుండి 2024 వరకు రైతులు ఎంత మోసపోయారు
- -- రైతులకు తెలియని నష్టానికి పరిహారం చెల్లింపు ఎంత..?
- -- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన పై స్పందన
- -- చెరుకు రైతులకు న్యాయం జరగాలి
- -- జిల్లా వ్యవసాయ అధికారి కి వినతి పత్రం అందజేత
- -- బారసా నాయకుల డిమాండ్





కామారెడ్డి జిల్లా (లోకంతీరు) జూలై 25కామారెడ్డి జిల్లా ఉమ్మడి రామారెడ్డి, సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలోఇటీవల జరిగిన రైతు రుణాల గోల్మాల్ సంఘట 2002 నుండి 2024 వరకు రైతుల పై గాయత్రి ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల (దస్తావేజులను) పాస్ పుస్తకాలతో పాటు ఎరువుల పేరిట, చెరుకు విత్తనం ఇవ్వడానికి, చెరుకు తరలింపుకు, చెరుకు యొక్క సమగ్ర సమాచారాన్ని సేకరించడానికి గతంలో రైతుల వద్ద నుండి పాస్ పుస్తకాలను జిరాక్స్ కాపీలను తీసుకున్నారు. ఏమీ తెలియని రైతులు చెరుకు ఫ్యాక్టరీ యాజమాన్యం ఫీల్డ్ మెన్ అసిస్టెంట్ ద్వారా అడిగిన పేపర్లను ఇచ్చారు. ఆ తర్వాత ఫీల్డ్ మెన్ సిబ్బందిని కొద్దికొద్దిగా తగ్గించారు. తదుపరి పాత పంట పాస్ పుస్తకాల పై రైతులు మర్చిపోయారు. తదుపరి ధరణి పుణ్యమా వారికి కొత్త పాస్ పుస్తకాలు రావడంతో సంతోషపడ్డారు. ఇదే అదులుగా ఇటీవల కాలంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణమాఫీ పథకం ద్వారా మొదటి విడతగా లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేయడం జరిగింది. అదేవిధంగా రైతులకు మెసేజ్ కూడా పంపారు. బ్యాంకులలో అర్హులైన రైతులకు అమౌంట్ కూడా జమ చేయడం జరిగింది. అదేవిధంగా గాయత్రి ఫ్యాక్టరీకి సంబంధించిన రైతులకు కూడా రుణమాఫీ మెసేజ్లు రావడం జరిగిందని వాపోయారు..? ఇది ఎలా సాధ్యం మేము లోను తీసుకోలేదు అలాంటప్పుడు మాకు మెసేజ్ ఎలా వస్తాయి అని అనుమానం మొదలుకొని తీరా గాయత్రి ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని గట్టిగా అడగడం ద్వారా వాళ్లు ఉన్నది ఉన్నట్టుగా అవును వాస్తవమే రైతుల పేరిట 2002 నుండి 2024 వరకు సుమారు 19 కోట్ల 40లక్షల రూపాయలు బ్యాంకులో డిపాజిట్ అయ్యాయని అవి అలానే ఉన్నాయి. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదు రైతులకు నేరుగా చెక్కుల రూపేనా అందచేయడం జరుగుతుందని ఆ సంస్థ యాజమాన్యం బుధవారం తెలిపింది. ఇంతవరకు వాస్తవమే అయితే ఇన్ని రోజులు రైతుల యొక్క రుణమాఫీ కి సంబంధించి పూర్తి సమగ్ర సమాచారం సేకరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని, అదేవిధంగా గత ప్రభుత్వం కూడా రుణమాఫీని వర్తింపజేసింది. ఆ డబ్బులు ఎక్కడికి వెళ్లాయి...?గత తెలంగాణ ప్రభుత్వం రెండు దఫాలుగా రుణమాఫీని రైతులకు వర్తింపజేసింది. ఇట్టి విషయంలో ఈ యొక్క చెరుకు రైతులకు సంబంధించిన రుణమాఫీ వర్తించిందా లేదా? ఫ్యాక్టరీ యాజమాన్యం పూర్తిగా స్పందించి రైతులకు న్యాయం చేయవలసిందిగా రైతుల తరఫున బిఆర్ఎస్ నాయకులు గట్టిగా రైతు పక్షాన నిలబడి నిడదీసిన ఘనత.పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బారాస నాయకులు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. గాయత్రి యజమాని రైతుల పేరిట బ్యాంకులో రుణాలు తీసుకొని వారికి తెలియకుండా మోసం చేశారని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మాఫీ చేయడంతో అసలు విషయం బయటకు వచ్చిందని వారు ఆరోపించారు.కలెక్టర్ సూచన మేరకే విచారణ అధికారిగా మీారు నందున వినతి పత్రం అందజేస్తున్నామని వారు పేర్కొన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం రెండుసార్లు రుణమాఫీ చేశారని అప్పుడు కూడా రైతుల పేరిట రుణాలు మాఫీ అయ్యాయా అనే విషయం పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.పూర్తి విచారణ జరిపిన తర్వాత ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.వ్యవసాయ అధికారిని కలిసిన వారిలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సదా శివనగర్ ఉమ్మడి మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు, రామారెడ్డి మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డ,ఉప్పల్ వాయి మాజీ సర్పంచ్ గంగారాం,రామారెడ్డి మండల యూత్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కుప్రియాల్ మాజీ ఉపసర్పంచ్ కలాలి సాయ గౌడ్ సీనియర్ నాయకులు పోతుల లింగారెడ్డి, లింబాద్రి నాయక్, జంగం లింగం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ అందరి అవసరాలకోసం

## ప్రభుత్వ సలహా దారుమహమ్మద్ అలి షబ్బీర్

కామారెడ్డి ,జూలై25:అందరికీ ఆమోద యోగ్యమైన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అనితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. తాను సలహాదారుగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వెల్ఫేర్ శాఖలకు తగిన ప్రాధాన్యం లభించేలా ప్రయత్నం చేశాను అని పేర్కొన్నారు.మైనార్టీ శాఖకు 3003 కోట్లు ఎస్సీ సంక్షేమానికి 33124కోట్లుఎస్టీ సంక్షేమానికి 17056 కోట్లుబీసీ సంక్షేమానికి 9200 కోట్లురెండు లక్షల 91,వేల 159 కోట్లతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసే విధంగా తెలంగాణ బడ్జెట్ వ్యవసాయ అనుబంధ రంగానికి పెద్ద పీట వేస్తూ 72,659 కోట్లు కేటాయించారు స్త్రీ శిశు సంక్షేమానికి 2736 కోట్లు వైద్య ఆరోగ్య శాఖకు 11,468 కోట్లు విద్య రంగానికి 21292 కోట్లునిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు.వ్యవసాయ రంగానికి నీటిని అందించడానికి నీటిపారుదల శాఖకి 22301 కోట్లు కేటాయించి రైతు పక్షపాతి ప్రభుత్వంగా ముద్ర వేసుకున్నాం పట్టణాభివృద్ధి తో పాటు పల్లెల అభివృద్ధికి బడ్జెట్లో పెద్దపీట వేశారు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్లో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాం వారిని కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో పలు పథకాలను ప్రాతిపాదించిన రేవంత్ సర్కారు. గ్రామీణ మహిళాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి పథకం తీసుకువస్తున్నట్లు ప్రకటన చేశారు. ఈ పథకం ద్వారా 63 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరాలనేది ప్రభుత్వం లక్ష్యం. స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం సహా వివిధ మార్గాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి, నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటు బ్రాండింగ్, మార్కెటింగ్‌లలోమెలకువలు నేర్పించేందుకు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందిడ్వాక్రా మహిళ సంఘాలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నాం హైదరాబాద్ మెట్రో కు భారీగా నిధులు కేటాయించాం పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ఈ సంవత్సరంలోనే ప్రారంభించబోతున్నాం. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రంగాలకే బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ హామీల అమలుకు దాదాపుగా రూ.50 వేల కోట్లకు పైగా నిధులు ముఖ్యంగా



రుణమాఫీకి రూ.30 వేల కోట్లు, రైతు భరోసా పథకానికి రూ.15 వేల కోట్లతో కలిపి ఒక్క వ్యవసాయ శాఖకే అత్యధికంగా రూ.50 వేల కోట్లకు పైగా నిధులు సంక్షేమ శాఖలన్నింటికీ కలిపి రూ.40 వేల కోట్లు, సాగు నీటి రంగానికి రూ.29 వేల కోట్లు, విద్యుత్ శాఖకు రూ.15 వేల కోట్లు, వైద్యశాఖకు రూ.15 వేల కోట్లు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం గృహనిర్మాణశాఖకు రూ.8 వేల కోట్ల నిధులు కేటాయించారు అని అన్నారు.

## మంత్రికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం వినతి



రాజంపేట కామారెడ్డి జిల్లా జూలై 25 లోకంతీరుజిల్లాలోని ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలం కొండాపూర్ గ్రామంలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని దామోదర రాజనర్సింహ కు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ గురువారం ప్రతిపాదనలు పంపారు.దీనికి వైద్య శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాజంపేట మండలం లోని కొండాపూర్ గ్రామములో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కృషి చేస్తున్న మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలుపున్నట్లు రాజంపేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి తెలిపారు.

## పసుపు బోర్డు ఏర్పాటుపై ఎంపీ, ఎమ్మెల్యేలు బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలి

### -కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్



ఆర్మూర్,జులై 25(లోకం తీరు ):స్వయంగా ప్రధాన మంత్రి తో పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేయించిన నిజామాబాద్ ఎంపీ అరవింద్, ఎంఎల్ఏ రాకేష్ రెడ్డి లు పసుపు బోర్డు కు నిధులు తీసుకురావడంలో విఫలం అయ్యారని, మొన్నటి యూనియన్ బడ్జెట్ లో నిధుల గురించి ప్రస్తావన లేకపోవడం జిల్లా రైతులకు తీవ్ర నిరాశ కలిగించింది అని, దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ జిల్లా బీజేపీ నాయకులు ఎంపీ, ఎంఎల్ఏ లు బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆలూరు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతారని అసెంబ్లీ తో పాటు, పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే జిల్లా ప్రజలకు వారు చేసింది గుండు సున్నా అని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు తిరుగుబాటు చేయకముందే జిల్లా అభివృద్ధికి, పసుపు బోర్డు ఏర్పాటుకు తగిన నిదులు మంజూరు చేసే విధంగా బీజేపీ అగ్ర నాయకత్వం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెపుతారని అన్నారు.

## తలసరి ఆదాయంలో మనమే మిన్న

### జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ

హైదరాబాద్,జూలై25: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన బడ్జెట్ ప్రసంగం చేస్తూ.. తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. 'ప్రస్తుతం తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ. రాష్ట్రంలో తలసరి ఆదాయ సగటు రూ.3,47,299 ఉంటే.. జాతీయ తలసరి ఆదాయ సగటు కేవలం రూ.1,83,236గా ఉంది. అంటే జాతీయ తలసరి ఆదాయ సగటుతో పోల్చితే.. రాష్ట్ర తలసరి ఆదాయ సగటు రూ.1,64,063 ఎక్కువగా ఉన్నది' అని భట్టి విక్రమార్క చెప్పారు. అయితే తలసరి ఆదాయ స్థాయిల్లో జిల్లాల మధ్య తీవ్ర అంతరం ఉన్నదని, రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ.9,46,862 ఉంటే.. వికారాబాద్‌లో రూ.1,80,241 ఉన్నదని ఆర్థిక మంత్రి చెప్పారు. జిల్లాల మధ్య ఉన్న ఆదాయ అంతరాలను తగ్గించడానికి తాము కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

# సినిమా తీరు

## మిస్టర్ బచ్చన్'.. బిజినెస్ గట్టిగానే..



మాస్ మహారాజ్ రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మిస్టర్ బచ్చన్ మూవీ ఆగష్టు 15న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. మాస్ మహారాజ్ రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మిస్టర్ బచ్చన్ మూవీ ఆగష్టు 15న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. మిరపకాయ్ మూవీ తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న సినిమా ఇదే కావడంతో కాస్త హైప్ నెలకొని ఉంది. కమర్షియల్ డైరెక్టర్ గా హరీష్ శంకర్ కి మంచి పేరుంది. గద్దల కొండ గణేష్ మూవీ తర్వాత చాలా లాంగ్ గ్యాప్ తీసుకొని హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని రెడీ చేస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు సాంగ్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మిక్కీ జే మియర్ ఈ సినిమాకి మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారు. గద్దల కొండ గణేష్ తర్వాత మరోసారి హరీష్ శంకర్ మిక్కీని మిస్టర్ బచ్చన్ సినిమా కోసం ఎంపిక చేశారు. మిక్కీ జే మియర్ కి గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో సక్సెస్ లో రాలేదు. మరల మిస్టర్ బచ్చన్ సినిమాతో బౌన్స్ బ్యాక్ అవ్వాలని ఆయన అనుకుంటున్నారు. ం్రీబనీ ఖీవజీట – ఆ బ్యూటీ క్లోజ్ ఫ్రెండ్ ఆవిడేనా? అందుకే మాస్ బీట్స్ తో అదిరిపోయే సాంగ్స్ ను ఈ సినిమాకి మిక్కీ అందించారు. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఇప్పటికే మూవీ బిజినెస్ కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. థియాట్రికల్, నాన్ థియాట్రికల్ కలిపి 40 కోట్ల బిజినెస్ ఈ సినిమా పైన జరిగిందని తెలుస్తోంది. రీజనల్ లాంగ్వేజ్ చిత్రంగానే మిస్టర్ బచ్చన్ సినిమా రెడీ అవుతోంది. ఈ లెక్కన చూసుకుంటే సాలిడ్ బిజినెస్ మిస్టర్ బచ్చన్ పై జరిగిందని చెప్పొచ్చు. మూవీ డిజిటల్ రైట్స్ ని నెట్ ఫ్లిక్స్ ఫ్యాన్సీ ధరకి సొంతం చేసుకుందంట. రవితేజ కెరియర్ లోనే హైయెస్ట్ డిజిటల్ రైట్స్ మిస్టర్ బచ్చన్ కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈగల్ లాంటి డిజాస్టర్ తర్వాత కూడా రవితేజ సినిమాకి 40 కోట్ల బిజినెస్ జరగడం అంటే మామూలు విషయం కాదు. దీనికి హరీష్ శంకర్ ట్రాక్ రికార్డ్ ఒక రీజన్ అని చెప్పొచ్చు. అలాగే హిందీలో సూపర్ హిట్ అయిన అజయ్ దేవగన్ రైడ్ మూవీకి రీమేక్ గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మూవీపైన కూడా పాజిటివ్ బజ్ ఉంది. రెండు సాంగ్స్ ప్రేక్షకులకి బాగా కనెక్ట్ అయ్యాయి. రవితేజ సినిమాలు ఫ్లాప్స్ అయిన కూడా ఇప్పటికి అతనికి సాలిడ్ మార్కెట్ ఉంది. ఈ ఫ్యాక్టర్స్ అన్ని కలిసి రావడంతో మిస్టర్ బచ్చన్ సినిమాకి మంచి బిజినెస్ జరిగిందంట.






## దేవర.. మరో భయంకరమైన విలన్ వచ్చేశాడు




క్యాస్టింగ్ కి ఒకప్పుడు ఉండే లిమిటేషన్స్ ఇప్పుడు లేవు. అందుకే బాలీవుడ్ స్టార్ యాక్టర్స్ కూడా ఇతర భాషలలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. సౌత్ ఇండియాలో స్టార్ హీరోలు అందరూ కూడా పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. యూనివర్సల్ గా అన్ని భాష వారికి చేరువ అయ్యే కథలకి పెద్దపీట వేస్తూ భారీ బడ్జెట్ సినిమాలని సెట్స్ పైకి తీసుకొని వెళ్తున్నారు. ఇలాంటి కథలతో తమ మార్కెట్ ని మన స్టార్ హీరోలు పెంచుకుంటున్నారు. పాన్ ఇండియా కథలని అన్ని భాషల ప్రేక్షకులకి రీచ్ చేయడం కోసం కీలక పాత్రల కోసం కూడా డిఫరెంట్ లాంగ్వేజ్ లకి చెందిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఆ బ్యూటీ క్లోజ్ ఫ్రెండ్ ఆవిడేనా? క్యాస్టింగ్ కి ఒకప్పుడు ఉండే లిమిటేషన్స్ ఇప్పుడు లేవు. అందుకే బాలీవుడ్ స్టార్ యాక్టర్స్ కూడా ఇతర భాషలలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. అవకాశాల కోసం స్టార్ యాక్టర్స్ ఎక్కువ స్పేస్ క్రియేట్ చేసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య ఎక్కువగా సౌత్ సినిమాలలో బాలీవుడ్ స్టార్స్ కనిపిస్తున్నారు. ఇప్పటికే సంజయ్ దత్ కేజీఎఫ్ పార్ట్ 2లో విలన్ గా నటించాడు. తెలుగులో డబుల్ ఇస్మార్ట్ మూవీలో ప్రతినాయకుడిగా కనిపిన్నాడు. ఇమ్రాన్ హష్మీ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీలో ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. యానిమల్ సినిమాతో బాబీ డియోల్ విలన్ అవతారం ఎత్తాడు. ప్రస్తుతం సౌత్ లో సూర్య హీరోగా తెరకెక్కుతోన్న కంగువలో బాబీ డియోల్ విలన్ గా నటించాడు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో కూడా బాబీడియోల్ ప్రతినాయకుడిగా కనిపించబోతున్నాడు. ఇప్పుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ దేవర మూవీ కోసం రాబోతున్నట్లు తెలుస్తోంది. చిత్ర యూనిట్ బాబీ డియోల్ ని పవర్ఫుల్ రోల్ కోసం క్యాస్టింగ్ చేసినట్లు తెలుస్తోంది. దేవర మూవీని కొరటాల శివ రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగంలో సైఫ్ అలీఖాన్ విలన్ గా కనిపించబోతున్నారు. దేవర పార్ట్ 1 మూవీ ఎండింగ్ తో పాటు దేవర పార్ట్ 2 మెయిన్ విలన్ గా బాబీ డియోల్ లో ప్రెజెంట్ చేయబోతున్నారంట. త్వరలో బాబీ డియోల్ నటించబోతున్నట్లు అఫీషియల్ గా చిత్ర యూనిట్ ఎనౌన్స్ చేసే అవకాశం ఉందంట. దేవర ఫ్రాంచైజ్ లో ఇద్దరు బాలీవుడ్ స్టార్ యాక్టర్స్ తో జూనియర్ ఎన్టీఆర్ తలపడబోతున్నాడని అర్ధమవుతోంది. సెప్టెంబర్ 27న ఈ చిత్రం వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతోంది. జాన్వీ కపూర్ దేవర చిత్రంతో టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది.

## అందానికే మరో అందం....



## విజయ్ దేవరకొండపై మళ్ళీ షాకింగ్ పోస్ట్ పెట్టిన అనసూయ!!

బుల్లితెరలో ప్రయాణం ప్రారంభించి వెండితెరలో వెలుగు వెలుగుతున్న అనసూయ భరద్వాజ్ ఏం చేసినా హాట్ టాపిక్ నే. మెయిన్ గా ఎక్స్ ఖాతాలో అనసూయ పెట్టే పోస్టులు చాలా కాంట్రవర్సీలను క్రియేట్ చేస్తాయి. అనసూయ సెలెక్ట్ చేసుకునే క్యారెక్టర్స్,అనసూయ డ్రెస్సింగ్ స్టైల్, అనసూయ యాటిట్యూడ్ ప్రతి ఒక్కటి ఇండస్ట్రీలోనూ, జనాలలోను చర్చకు కారణంగా మారుతూనే ఉన్నాయి. ఏపీలో పాలనపై ఢిల్లీ వేదికగా జగన్ సంచలన కామెంట్స్..!! మళ్ళీ అనసూయ వ్యాఖ్యల రగడ గతంలో తనను ఆంటీ అన్న వాళ్లపైన విరుచుకుపడిన అనసూయ లీగల్ యాక్షన్ తీసుకుంటానని షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక ఈమధ్య యంగ్ హీరో విజయ్ దేవరకొండను కెలికిన అనసూయ మళ్లీ తాజాగా ఒక షాకింగ్ పోస్ట్ పెట్టి విజయ్ దేవరకొండ ను వార్తల్లోకి లాగింది. అనసూయ, విజయ్ దేవరకొండ విషయంలో తాజాగా ప్రెస్ మీట్ లో మీడియా అడిగిన ప్రశ్నలకు చేసిన వ్యాఖ్యలతో మరోమారు రచ్చ మొదలైంది. ప్రపంచంలో పవర్ ఫుల్ పాస్ పోర్టులివే–వీసా అక్కర్లేని ప్రయాణం...! తెలంగాణ బడ్జెట్ రూ. 2.95 లక్షల కోట్లు: ఆ రెండింటికీ అధిక వాటా– ఓకే చెప్పిన రేవంత్: పండగే విజయ్ దేవరకొండ విషయంలో అనసూయ లేటెస్ట్ కామెంట్స్ సింబా సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ఆమె నటించిన ఒక సీన్ పై మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పిన అనసూయ విజయ్ దేవరకొండకు తనకు మధ్య పెద్ద గొడవలు ఏమీ లేవని ,స్టేజ్ మ్యానర్స్ గురించే ఆ రోజు తాను మాట్లాడాల్సి వచ్చిందని, లైమ్ లైట్ లో ఉన్నప్పుడు పద్ధతిగా ఉండాలని చెప్పానని, అంతకుమించి ఎవరి మీద తనకు వ్యక్తిగతంగా ఎటువంటి గొడవలు లేవని పేర్కొన్నారు. తాజాగా షాకింగ్ పోస్ట్ పెట్టిన ు అనసూయ భరద్వాజ్ చేసిన పోస్ట్ అందరిని ఒక్కసారిగా షాక్ కి గురిచేసింది. మరీ ఇంత చేతగాని వాళ్ళ లాగా ఉంటే ఎలా అండి.. నిజంగా మీకు కాలుతుంది.




## శాంసన్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. ఇకపై భారత జట్టులో చోటు పక్కా.. ఇదిగో సాక్ష్యం..




కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో, శ్రీలంక సిరీస్ కోసం టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో టీమ్ ఇండియా శిక్షణా సెషన్ వీడియో ఒకటి బయటకు వచ్చింది.ఇందులో గౌతమ్ గంభీర్ ఆటగాళ్లను నిశితంగా గమనిస్తూ వారికి అవసరమైన సలహాలు ఇస్తున్నాడు. ఇంతలో, ఒక విషయం అందరి దృష్టిని ఆకర్షించింది. గౌతమ్ గంభీర్ ప్రముఖ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్‌తో చాలా సేపు మాట్లాడాడు. శిక్షణ సమయంలో గౌతమ్ గంభీర్ శాంసన్‌తో మాట్లాడుతున్న తీరు చూస్తుంటే పలు ఊహాగానాలు వస్తున్నాయి.సంజూ శాంసన్ గురించి చెప్పాలంటే, అతను జట్టులో చోటు దక్కించుకున్నా.. బెంచ్‌కే పరిమితం అవుతున్నాడు. అతనికి ఎప్పుడూ జట్టులో సాధారణ స్థానం లభించలేదు. అతను ు20 ప్రపంచ కప్‌నకు ఎంపికయ్యాడు. కానీ, మొత్తం టోర్నమెంట్‌లో అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. అందుకే ఈ విషయంపై చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే, ఇప్పుడు గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో సంజూ శాంసన్‌కు రెగ్యులర్ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో టీమ్ ఇండియా ట్రైనింగ్ సెషన్ కోసం రంగంలోకి దిగినప్పుడు, గౌతమ్ గంభీర్ సంజూ శాంసన్‌తో వన్ టు వన్ మాట్లాడాడు. దీన్ని బట్టి ఇప్పుడు టీమ్ ఇండియాలో సంజూ శాంసన్‌కి మంచి రోజులు మొదలయ్యాయని, అతనికి నిరంతరం ఆడే అవకాశం లభించవచ్చని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. గౌతమ్ గంభీర్ ఎల్లప్పుడూ సంజూ శాంసన్‌కు చాలా మద్దతునిచ్చాడు. ఇప్పుడు ప్రధాన కోచ్ అయిన తర్వాత, శాంసన్ మ్యాచ్‌లలో ఆడటం చూడవచ్చు. అయితే, దీని కోసం శాంసన్ మెరుగైన ప్రదర్శనను కొనసాగించాల్సి ఉంటుంది.గౌతమ్ గంభీర్ తన మొదటి విలేకరుల సమావేశంలో ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు. గంభీర్ ప్రకారం, అతను కోచ్, ప్లేయర్ మధ్య సంబంధాన్ని కోరుకోవడం లేదు. బదులుగా ప్రతి ఒక్కరూ ఒకరినొకరు విశ్వసించాలని, ఎల్లప్పుడూ ఆటగాళ్లకు తన పూర్తి మద్దతునిస్తాడని ఆశిస్తున్నాడు.

## వర్షాకాలంలో శరీర దుర్వాసన: చెమట వాసనను వదిలించుకోవడానికి చాలా సింపుల్ టిప్స్..ఇలా చేస్తే చాలు..

వేసవి రోజుల్లో శరీరం చాలా చెమట పడుతుంది. దీని వల్ల శరీరం చెమట వాసన వస్తుంది. వర్షాకాలంలో కూడా ఇదే సమస్య ఎదురవుతోంది. వాతావరణంలో తేమ కారణంగా, చెమట పట్టిన తర్వాత చర్మం జిడ్డుగా మరియు జిగటగా మారుతుంది. వర్షాలు కురిసిన తరువాత, వాతావరణం ప్రతిచోటా చల్లగా ఉంటుంది, కానీ వాతావరణంలోని తేమ యొక్క ప్రభావాలు చెమటకు దారితీస్తాయి. చెమట పట్టిన తర్వాత శరీరం నుంచి దుర్వాసన వస్తుంది. వర్షాకాలంలో డయేరియా ప్రమాదం, ఈ హోం రెమెడీస్ తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి స్వేద గ్రంథుల నుండి విడుదలయ్యే చెమటకు వాసన లేదా సువాసన ఉండదు. కానీ చర్మంలోని బ్యాక్టీరియా చెమటతో తాకినప్పుడు శరీర దుర్వాసన మొదలవుతుంది. అప్పుడు చెమటతో కూడిన మరియు దుర్వాసనతో కూడిన పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఈ కారణంగా శరీరం దుర్వాసన వస్తుంది. మీరు ఈ విధంగా మాట్లాడటం ఖచ్చితంగా మీ భాగస్వామిని బాధపెడుతుంది కన్యారాశి వారికి జులై 31 వరకు కనక వర్షం..!! శరీర వాసన బ్రోకలీ, రెడ్ మీట్, క్యాబేజీ లేదా ఆల్కహాల్ వంటి అనేక ఆహారాలపై ఆధారపడి ఉంటుంది. శరీర దుర్వాసనను నివారించడానికి మీరు ఇంటి నివారణలను తీసుకోవచ్చు. ఇంట్లో ఇలా చేయడం వల్ల శరీరం చెమట వాసన రాదు. చెమట నుండి నోటి దుర్వాసన రాకుండా ఉండాలంటే ఎలాంటి హోం రెమెడీస్ ఫాలో చేయాలో తెలుసుకుందాం.. నిమ్మరసం బేకింగ్ సోడాను నిమ్మరసంలో మిక్స్ చేసి ఈ పేస్ట్‌ను చంకలపై అప్లై చేయాలి. 10 నుంచి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి చంకలను శుభ్రం చేసుకోవాలి. నిమ్మకాయలోని గుణాలు అండర్ ఆర్మ్ దుర్వాసనను తగ్గించడంలో సహాయపడతాయి. మిగిలిన నిమ్మకాయ పేస్ట్‌ను చర్మంపై రాయవద్దు. కరకరలాడే చకోడీలు.. వేల ఏళ్లుగా చేస్తున్న టేస్టీ డిష్..!! గ్రీన్ టీ బ్యాగ్ గ్రీన్ టీ శరీరానికి అవసరమైన ప్రయోజనకరమైన లక్షణాలను కలిగి ఉంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరాన్ని డిటాక్సిఫై చేయడంలో సహాయపడతుంది. గ్రీన్ టీ తీసుకోవడం వల్ల శరీరం లోపలి నుండి శుభ్రం అవుతుంది. వర్షపు రోజులలో చెమట వాసనను నివారించడానికి మీరు గ్రీన్ టీని తీసుకోవచ్చు. అలాగే గ్రీన్ టీని గోరువెచ్చని నీటిలో నానబెట్టి కొద్దిసేపు చంకలో ఉంచి చంకను నీటితో శుభ్రం చేసుకోవాలి. నేటి రాశి ఫలాలు: ఈరోజు ధనుస్సు రాశివారికి అదృష్టం!మిథున, కుంభ రాశులకి సూపర్ గా ఉంటుంది.మిగతా రాశుల పరిస్థితి రోజ్ వాటర్ రోజ్ వాటర్ చర్మ సంబంధిత సమస్యలను నయం చేయడానికి ఉపయోగిస్తారు. రోజ్ వాటర్ చర్మ రంధ్రాలను తగ్గిస్తుంది మరియు కొన్ని చుక్కల రోజ్ వాటర్ ను ఆపిల్ సైడర్ వెనిగర్ తో కలపండి. తర్వాత ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో నింపాలి. ఈ మిశ్రమాన్ని చంకలకు అప్లై చేయడం వల్ల చంకల్లోని దుర్వాసన తగ్గుతుంది. రోజ్ వాటర్ యొక్క తేలికపాటి సువాసన శరీర దుర్వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. యాపిల్ సైడర్ వెనిగర్ చెమట వల్ల వచ్చే శరీర దుర్వాసనను తగ్గించడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించండి. ఇది చంకలోని బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్ ను నీళ్లలో కలిపి చంకలపై అప్లై చేయాలి. హైడ్రేటెడ్ గా ఉండండి వేసవిలో లాగే వర్షాకాలంతో సరిగా నీళ్ళు తాగరు.దాంతో శరీరం డీహైడ్రేషన్ కు గురి అవుతుంది. చెమట దుర్వాసన వస్తుంది. కాబట్టి రోజులో దాహం కాకపోయినా తగినంత నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. దాంతో చెమటను పలుచన చేసి, దాని దుర్వాసనను తగ్గిస్తుంది. స్పైసీ ఫుడ్స్ తినడం మానుకోండి ఉప్పు, కారం మరియు మసాలా ఆహారాలు శరీరంలో వేడిని పెంచుతాయి,



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.